

అతిథి అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముథోల్, సెప్టెంబరు 21 : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ సబ్జెక్టులలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. ఇందులో ఆంగ్లము, తెలుగు, ఎకనామిక్స్, కామర్స్, జువాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులలో పీజీలో కనీసం 55 శాతం మార్కులు ఉన్న అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ లోపల భైంసా గోపాలరావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.









లబ్ధిదారులకు ప్రభుత్వ లేఖల పంపిణీ

భైంసా, సెప్టెంబరు 21 : ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా మహాలక్ష్మీ పథకంలో రూ.500లకే వంట గ్యాస్ సిలెండర్ పొందుతున్న లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేరు మీదుగా లేఖల పంపిణీ జరుగుతోంది. నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా సంబంధిత లేఖల పంపిణీ ముమ్మరంగా కొనసాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రేషన్ డీలర్ల ద్వారా, మున్సిపల్ కేంద్రాల్లో మున్సిపల్ సిబ్బంది, రేషన్ డీలర్ల ద్వారా ప్రభుత్వ లేఖలు లబ్దిదారులకు అందిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హమీ మేరకు తెల్లరేషన్ కార్డు కలిగిన కుటుంబంలోని వారికి వంట గ్యాస్ సిలిండర్ రూ.500లకే ప్రభుత్వం అందిస్తోంది. శనివారం భైంసాలో మున్సిపల్ సిబ్బంది రేషన్‌షాపుల వారీగా లబ్దిదారులకు ప్రభుత్వం నుంచి సరఫరా అయిన లేఖను అందజేశారు.

సమ్మె విరమించి విధుల్లో చేరిన ఆరోగ్య మిత్రలు

భైంసా, సెప్టెంబరు 21 : తమ సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం మూడురోజులుగా చేపట్టిన సమ్మెను ఆరోగ్యమిత్రలు విరమించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో, ఆరోగ్య మిత్రల రాష్ట్ర కమిటీ ప్రతినిధులతో వైద్యారోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ చేపట్టిన చర్చలు సఫలీకృతమయ్యాయి. దీంతో బుధవారం నుంచి కొనసాగిస్తున్న సమ్మెను విరమించిన ఆరోగ్యమిత్రలు శనివారం విధులకు హాజరయ్యారు. ఆరోగ్య మిత్రల డిమాండ్లలో క్యాడర్ మార్పు అంగీకారంతో పాటు వేతనాన్ని రూ.15 వేల నుంచి రూ.19,500కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సమ్మెను విరమించి విధులకు హాజరైనట్లుగా ఆరోగ్యమిత్రల కమిటీ జిల్లా ప్రతినిధులు పేర్కొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

భైంసారూరల్, సెప్టెంబరు 21 : మండలంలోని ఎగ్గాం గ్రామంలో శనివారం డ్రైనేజీలలో నీరు నిల్వకుండా, పచ్చదనం పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలని ఎంపీవో మోజాం హుస్సేన్ తెలిపారు. గ్రామంలో ప్రతి వ్యక్తి వారి ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శికి గ్రామంలో అన్ని కార్యక్రమాలు కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మోజాం హుస్సేన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదివేందుకు అనువైన వాతావరణం కల్పించాలి

దిలావర్‌పూర్, సెప్టెంబరు 21 : ఇంటి వద్ద విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా సరైన వాతావరణం కల్పించే బాధ్యత తల్లిదండ్రులదేనని దిలావర్‌పూర్ ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సదానందం అన్నారు. శనివారం పాఠశాలలో జరిగిన పోషకుల సమావేశంలో మాట్లాడారు. పిల్లలను ఒత్తిడికి, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు. ప్రశాంతంగా చదువుకునేందుకు ఇంటి వద్ద తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పిల్లలు చదువుకునే సమయంలో టీవీలు కట్టేయాలని సూచించారు. పిల్లలను కోప్పడకుండా మంచి చెడులను వివరించాలన్నారు. చదువుకుంటే కలిగే ప్రయోజనాలను, చదవకపోతే భవిష్యత్తులో ఎదురయ్యే కష్టాలను చెప్పడం ద్వారా పిల్లల్లో చదువుకోవాలన్న సంకల్పం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీకి ఘన నివాళి

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 21 : తెలంగాణ రాష్ట్ర సాధనలో కొండా లక్ష్మణ్ బాపూజీ పాత్ర కీలకమని మున్సిపల్ చైర్మన్ జి. ఈశ్వర్ అన్నారు. శనివారం కొండా లక్ష్మణ్ వర్ధంతి సందర్భంగా ఆర్డీవో కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో ప్రధాన భూమిక పోషించి మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన పోరాట యోధుడన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, పద్మశాలీ సంఘ నాయకులు జల్దా రమణ, పెండెం శ్రీనివాస్, మిట్టపల్లి నర్సయ్య, రేగుంట రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కుభీర్ : మండల కేంద్రం కుభీర్‌లోని పద్మశాలి సంఘంలో శనివారం కొండా లక్ష్మణబాపూజీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు చిలుక గజేందర్ మాట్లాడుతూ తెలంగాణ సాధనకు తన జీవితాన్ని దార పోసిన మహనీయుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాక్షుడు సాప పండరి, పద్మశాలీలు గణేష్, కోలూర్ లక్ష్మణ్, నరేష్, వాసుదేవ్, పోతన్న పాల్గొన్నారు.

కుంటాల : మండలంలోని కల్లూర్ గ్రామంలో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బ్యాంక్‌లో చోరీకి యత్నించిన ఇద్దరి అరెస్ట్

● వారం రోజుల్లో కేసును ఛేదించిన పోలీసులు

ముథోల్, సెప్టెంబరు 21 : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో పాత బస్టాండ్ సమీపంలో ఉన్న ఎస్‌బీఐ బ్యాంక్‌లో చోరీకి యత్నించిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ముథోల్ సీఐ మల్లేష్ తెలిపారు. ఈ కేసు వివరాలను శనివారం ముథోల్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సీఐ కథనం ప్రకారం.. ఈ నెల 13వ తేదీన ముథోల్ పాత బస్టాండ్ సమీపంలో గల ఎస్‌బీఐ బ్యాంక్ వెనుక భాగంలో వెంటిలేటర్‌కు ఉన్న ఇనుప చువ్వలు తొలగించి ఇద్దరు దొంగలు బ్యాంక్‌లో చొరబడ్డారు. బ్యాంక్‌లో ఉన్న సీసీ కెమెరాలు, అలారం వైర్‌లను కత్తిరించి చోరీకి యత్నించారు. వీలుకాకపోవడంతో పరారయ్యారు. అయితే ఆ రోజు గణేష్ నిమజ్జనం ఉండడం, పోలీస్‌బందోబస్తు ఉన్నప్పటికీ చోరీ జరగడంతో ముథోల్ పోలీసులు ఈ కేసును సవాల్‌గా తీసుకున్నారు. సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో ఎస్సై సాయికిరణ్ తన సిబ్బందితో రెండు టీంలుగా ఏర్పాటు చేసి విచారణ ముమ్మరం చేశారు. దీంతో బ్యాంక్‌లో ఉన్న సీసీ కెమెరాల్లో ఇద్దరు నిందితులు కనిపించడంతో విచారణ జరిపారు. దీంతో ముథోల్‌కు చెందిన షేక్ మోసిన్ అహ్మద్, మహ్మద్ ఇర్ఫాన్ ఉద్దీన్‌లు చోరీకియత్నించినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను శనివారం ఉదయం అరెస్టు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

పోలీసు సేవలు అభినందనీయం

ముథోల్‌లో గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరగడానికి ఇక్కడి పోలీసుల సేవలు అభినందనీయమని ముథోల్ హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు రోళ్ల రమేష్ అన్నారు. ముథోల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం సీఐ మల్లేష్, ఎస్సై సాయికిరణ్‌లను హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణకు తమ వంతు సహకారం ఎప్పుడు ఉంటుందని వారు పేర్కొన్నారు.



















విజయవంతంగా ముగిసిన బోస్ ఫెలోషిప్ కార్యక్రమం

ఉట్నూర్, సెప్టెంబరు 21 : ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాలుగురోజులుగా భారత్‌దేఖో ఆర్గనైజేషన్, ఐటీడీఏ ఉట్నూర్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న బోస్ ఫెలోషిప్ శిక్షణ తరగతులు విజయవంతంగా శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు ఈ నాలుగు రోజులు వారు నేర్చుకున్న విషయాలను, పొందిన అనుభవాలను వ్యక్తం చేస్తూ సంతోషంతో నేర్పించిన మెంటర్స్ పవన్, ఆస్రాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టి.ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు నేర్చుకున్న శిక్షనను సద్వినియోగం చేసుకుని ఈ శిక్షణ కార్యక్రమం లక్ష్యాన్ని, ఉద్దేశ్యాన్ని నేరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.జి.సాయిప్రసాద్, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ డా.ఎం.నర్సింగ్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక మార్గంతో మనశ్శాంతి

తలమడుగు , సెప్టెంబరు 21 : ఆధ్యాత్మిక మార్గంతోనే ప్రతి ఒక్కరికీ మనశ్శాంతి లభిస్తుందని సహకార సంఘం సీఈవో మోతే శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాటాడుతూ శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు.














ఆటో బోల్తా : బాలుడి మృతి

● పలువురికి గాయాలు

భైంసా రూరల్, సెప్టెంబరు 21 : మండలంలోని మాంజ్రి గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి బాలుడు మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భైంసా నుంచి తానూర్‌కు వెళ్తున్న ఆటో మాంజ్రి గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు బోల్తాపడి పలువురికి గాయాలు కాగా, బాలుడు మృతి చెందారు. భైంసా పట్టణం కిసాన్ గల్లికి చెందిన నందగిరి సాయినాథ్ గాయత్రి దపంతుల కుమారుడు వశీకర్(11) మృతిచెందాడు. భైంసా పట్టణంలో శిశుమందిర్ పాఠశాలలో నాల్గోతరగతి చదువుతున్నాడు. ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

పాఠశాలలో మాక్ ఎన్నికలు

తలమడుగు , సెప్టెంబరు 21 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం పాఠశాల విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ ఎమ్మెల్సీ ఎన్నికలు రియల్ ఎన్నికలను తలపించాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించి మెరుగైన పాలన కోసం ప్రజాప్రతినిధులను ఏ విధంగా ఎన్నికోవాలో వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే పాఠశాల విద్యార్థులకు మాక్ పోలింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉండగా ఎన్నికల నిర్వహణ కోసం ఏ విధంగా ఏర్పాట్లు చేపడతారు. అదే తరహాలో ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల అధికారి పర్యవేక్షకులు ఎన్నికల సిబ్బంది వైద్య సిబ్బంది ఎన్నికల ప్రచారం ఓటింగ్ కౌంటింగ్ బ్యాలెట్ పేపర్ల ఓటింగ్ సరళి తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఎన్నికలను ఎంపీడీవో చంద్రశేఖర్ పరిశీలించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను విద్యార్థులను ఎంపీడీవో అభినందించారు. ఇందులో పాఠశాల ఉపాధ్యాయులు వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేలో బీఎల్‌వోలు

బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 21 : గ్రామపంచాయతీల ఎన్నికలలో భాగంగా పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో కార్యదర్శులు ఓటరులిస్టులను పంచాయతీలలో అతికించారు. ఏమైనా అభ్యం తరాలుంటే పంచాయతీ కార్యాలయాల్లో అభ్యంతరాలను స్వీకరించారు. సమయం ముగియడంతో తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో ఇంటింటి సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వే విధివిధానాలను వారికి తెలియజేశారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించే విధంగా చూడాలని వారికి సూచించారు. ప్రతి ఇంటికి వెళ్ళి అర్హులైన అందరికి ఓటుహక్కు ఉందా లేదా ఉంటే వివరాలు అన్ని సరిగా ఉన్నాయా వంటి వివరాలు తెలుసుకుని వారికి ఓటుహక్కును జారీ చేస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమం లో తహసీల్దార్ శంకర్, డీటీ హీరాలాల్, ఆర్ఐలు సాగర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్, నూర్‌సింగ్, బీఎల్వోలు పాల్గొన్నారు.

గ్రామాల్లో జ్వరాల పై సర్వే


నార్నూర్, సెప్టెంబరు 21 : వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్ఈఓ తులసీదాస్‌రాథోడ్ అన్నారు.శనివారం మండలంలోని బాబేఝరి గ్రామ పంచాయతీ పరిధిలో వైద్య శిబిరాన్ని నిర్వహించి రోగులకు చికిత్స చేసి వారికి ఉచిత మందులు అందించారు. జ్వరం పై ఇంటింటా సర్వే నిర్వహించి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారికి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించి సలహా సూచనలు అందించారు.కలనగున ప్రబ్లిస్తే నేరుగా స్థానిక పీహెచ్‌సీలకు వచ్చి డాక్టర్లను సంప్రదించి వైద్యం తీసుకోవాలి ఆయన పేర్కొన్నారు. వారి వెంట వైద్య సిబ్బంది జవవాహర్ హిమాబిందు, అంగన్‌వాడీ తదితరులు న్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

బోథ్, సెప్టెంబరు 21 : మండల కేంద్రంలోని శివభక్త మార్కండేయ ఆలయంలో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డుగంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన కృషి మర్చిపోలేనిది అన్నారు. స్వాతంత్ర పోరాటం నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. మూడు దశల ఉద్యమాలు ప్రముఖ పాత్ర పోషించిన మహనీయుడు అన్నారు. 27న విగ్రహ ప్రారంభం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో నూతనంగా నిర్మించిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమం ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు పద్మశాలి సంఘం అధ్యక్షుడు మెరుగు భోజన్న, ప్రధాన కార్యదర్శి మాసం అనిల్, కుమార్ , గౌరవ అధ్యక్షులు గంగుల మల్లేశ్వరి తెలిపారు. కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు జాదవ్ అనిల్‌తో పాటు ఎంపీ జినగేష్, ఎమ్మెల్సీ దండే విఠల్, తీర్మార్ మల్లన్న హాజరుకానున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గాను ప్రతి ఒక్కరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. మండలంలోని దన్నూర్ గ్రామంలో గ్రామస్తులు కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘనమైన నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు ఆసాల తదితరులు పాల్గొన్నారు.








నేడు జిల్లాకు ఎమ్మెల్సీ కోదండరాం రాక

ఖానాపూర్, సెప్టెంబరు 21 : జిల్లాకు ఎమ్మెల్సీ కోదండరాం ఆదివారం రానున్నట్లు టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు తెలిపారు. ఈ మేరకు శనివారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యమకారుల కోరిక మేరకు ఆదివారం సాయంత్రం 4 గంటలకు జిల్లా పెన్షనర్స్ సంఘ భవనంలో తెలంగాణ విద్యావంతుల వేదిక ద్వారా తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి తెలంగాణ ఉద్యమకారులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.



జిల్లా ఎస్పీకి సన్మానం

నిర్మల్, సెప్టెంబరు 21 : పట్టణంలోని నాయుడు వాడ గుట్ట వీరన్న అంజనేయ గణేష్ మండలి ఆధ్వర్యంలో శనివారం జిల్లా ఎస్పీ జానకీషర్మిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు కాలనీ వాసులు మాట్లాడుతూ.. పట్టణంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రశాంత వాతావరణంలో.. ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గణేశుడి శోభాయాత్ర జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి శాంతి భద్రతలు పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ జానకీ షర్మిల సేవల ను ఈ సందర్భంగా వారు కొనియాడారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజలందరి సహకారంతోనే జిల్లాలో గణేశ్ శోభాయాత్రను ఎటువంటి సంఘటనలు జరగకుండా శాంతియుతంగా జరపడం జరిగిందన్నారు. శోభాయాత్రకు సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు మరోమారు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకుడు వాడ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలి

● కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, సెప్టెంబరు 21 : వానాకాలం వరిధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభి లాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం సంబంధిత అధికారులు మిల్లర్లతో సమావేశం నిర్వహిం చారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ సమావేశానికి హాజ రయ్యారు. ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళికలు రూపొందించు కోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ నుంచే ధాన్యంపై రూ.500ల బోనస్ వర్తింపజేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగ కుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కేంద్రాల్లో సరిపడా తూకం, తేమ, ప్యాడి క్లీనింగ్ యంత్రాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్రాల్లో ఫిర్యాదు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం తరలింపులో ఇబ్బందులు కలుగ కుండా రవాణాకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నియమాలు పాటించని రైస్‌మిల్లర్లకు ధాన్యం కేటాయించవద్దన్నారు. ఎలాంటి పొరపాట్లు జరిగినా.. కఠిన చర్యలుంటాయన్నారు. ఈ సమావేశంలో డీఎస్‌వో కిరణ్ కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, పరిశ్రమ శాఖ మేనేజర్ నర్సింహా రెడ్డి, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ఆలూర్‌లో శోభాయాత్రను ప్రారంభించిన ఎస్పీ

సారంగాపూర్, సెప్టెంబరు 21 : మండలంలో గల ఆలూర్‌లో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేష్ నిమజ్జన శోభాయాత్రను శనివారం ఎస్పీ జానకీషర్మిల ప్రారంభిం చారు. అనంతరం హనుమాన్ మందిరంలో పూజలు చేసి మొక్కులను మొక్కారు. అలాగే గణేష్ మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఐ రామకృష్ణ, ఎస్సై శ్రీకాంత్‌లతో పాటు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

డీజే వాహనాలపై కేసు నమోదు

సారంగాపూర్, సెప్టెంబరు 21 : మండలంలో శుక్రవారం గణేష్ నిమజ్జనం శోభాయాత్ర నిర్వహించిన సమయంలో పరిమితికి మించి డీజే సౌండ్ సిస్టంను వాడారు. డీజే సౌండ్ సిస్టంలకు ఉపయోగించినటు వాహనాలను పట్టుకొని, యజమానులపై కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

నిర్మల్, సెప్టెంబరు 21 : నిర్మల్ జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా జే.రవి కిరణ్, ఉపాధ్యక్షులుగా పి.ఆనందం, ప్రధాన కార్యదర్శిగా మురళి, కోశాధికారిగా పి.నవీన్, జాయింట్ సెక్రటరీగా టి.విష్ణువర్ధన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా జి.సత్యపాల్ రెడ్డి, జే.బలరాం, సందీప్, మహిళా సెక్రటరీగా వి.విజయలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల అధికారులుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తుకారం, సుదర్శన్‌లు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

నిర్మల్, సెప్టెంబరు 21 : టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌ను ఆ పార్టీ నాయకుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు క్రిష్ణవేణి, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు. ఆ తర్వాత ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్కను అల్లూరి మల్లారెడ్డి, కృష్ణవేణిలు శంషాబాద్ విమానాశ్రయంలో కలుసుకున్నారు.



'వికసిత భారత్ నిర్మాణంలో భాగస్వామ్యమవుదాం'

లక్ష్మణచాంద, సెప్టెంబరు 21 : వికసిత భారత్ నిర్మాణంలో భాగస్వాములమవుదామని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు కూనింటి అంజుకుమార్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పొట్టపెల్లి(కె) తదితర గ్రామాల్లో పర్యటించి అందరూ సభ్యత్వం స్వీకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంక్షేమ ఫలాలు చిట్ట చివరి పేదవాడికి అందడమే లక్ష్యంగా, అంత్యోదయ సిద్ధాంతమే ధ్యేయంగా దేశ హితం కోసం పని చేస్తున్న భారతీయ జనతా పార్టీ సభ్యత్వాన్ని తీసుకుని వికసిత భారత నిర్మాణంలో భాగస్వామ్యం అవుదామని పిలుపునిచ్చారు. ఈ నెల 25లోగా పార్టీ ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి, జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ కమల్ నయన్, మండల సభ్యత్వ నమోదు కన్వీనర్ అడ్వాల రమేష్, అధ్యక్షులు పోలాస గోవర్ధన్, బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్ కోసం స్థల పరిశీలన

దిలావర్‌పూర్, సెప్టెంబరు 21 : మండల కేంద్ర సమీప అడవుల్లో ఊటకుంట, వట్టివేరు ప్లాంటేషన్‌కు అనువైన స్థలం కోసం శనివారం డీఆర్‌డీవో విజయలక్ష్మి పరిశీలన చేశారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టే ఊటకుంట వల్ల నీటి వృథాను అరికట్టవచ్చునని, పశుపక్షాదులకు, అడవి జంతువులకు తాగునీరు లభ్యమవుతుందని డీఆర్‌డీవో విజయలక్ష్మి అన్నారు. నీటి కుంటతో పాటు వట్టివేరు ప్లాంటేషన్ కోసం ప్రణా ళికలు సిద్ధం చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవోను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో గోవర్ధన్, ఏపీవో దివ్యారెడ్డి, పంచాయతీ ఈవో చంద్రశేఖర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మీనా పాల్గొన్నారు.





లేబర్ కార్యాలయ నిర్మాణం కోసం స్థల పరిశీలన

ఖానాపూర్, సెప్టెంబరు 21 : లేబర్ కార్డులు ఇప్పిస్తామంటూ వస్తున్న దళారులను నమ్మొద్దని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. త్వరలోనే ఖానాపూర్‌లో లేబర్ కార్యాలయాన్ని నిర్మించబోతున్నట్లు తెలిపారు. శనివారం లేబర్ ఆఫీసర్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ మనోహర్‌లతో కలిసి ఆయన లేబర్ కార్యాలయ నిర్మాణం కోసం ఆయన స్థల పరిశీలన చేశారు. స్థానిక మున్సిపల్ ఉద్యానవనం వద్ద లేబర్ కార్యాలయాన్ని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఖానాపూర్‌లో లేబర్ కార్యాలయం అయితే ప్రతి కూలీ లేబర్ కార్డును పొందేందుకు వెసులుబాటు కలుగుతుందన్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రమైన నిర్మల్‌లో లేబర్ కార్యాలయం ఉండడంతో ఈ ప్రాంత కూలీలు లేబర్ కార్డులను పొందలేకపోతున్నారన్నారు. అనంతరం పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో గల ప్రాథ మిక పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమా వేశానికి చైర్మన్ హాజరయ్యారు. రాజీవ్‌నగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసం ఉత్సవ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఖానాపూర్ పట్టణం లో అమృత్ 2 పథకంలో భాగంగా వాటర్ ట్యాంక్‌లు నిర్మించనున్న నేపథ్యంలో వరంగల్‌కు చెందిన డీఈఎం పద్మావతి స్థలపరిశీలనకు రావడంతో ఆమెతో కలిసి వాటర్ ట్యాంక్‌ల నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు.





బాలింత మృతికి కారణమైన వైద్యురాలిపై కేసు

● ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన

నిర్మల్, సెప్టెంబరు 21 : నిర్మల్ పట్టణంలో వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి బాలింత మృతికి కారణమైన వైద్యురాలిపై కేసు నమోదు చేసినట్లు నిర్మల్ పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రవీణ్ కుమార్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ పట్టణానికి చెందిన అఫ్రోజ్ అహ్మద్‌ఖాన్ తన భార్యకు పురిటి నొప్పులు రావడంతో స్థానికంగా ఉండే ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ డాక్టర్ వారి పరిస్థితి గమనించి సిజేరియన్ ఆపరేషన్ చేయాలని తెలిపారు. సిజేరియన్ ఆపరేషన్ చేసిన తర్వాత ఆమెకు తీవ్ర రక్త స్రావమై మరణించిందని తెలిపారు. అయితే తన భార్య మరణానికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆమె భర్త, బంధువులు ఆసుపత్రి వద్ద ధర్నా చేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైద్యురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బీజేపీలో కీలక నేతగా ఏలేటి!

● అంచెలంచెలుగా ఎదిగిన మహేశ్వర్ రెడ్డి

నిర్మల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చిన్న వయసులోనే రాజకీయాల్లోకి ప్రవేశించి అనతి కాలంలోనే అగ్రనేతగా ఎదిగిన నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి భారతీయ జనతా పార్టీలో కీలకనేతగా మారారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. నిర్మల్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు విజయం సాధించిన మహేశ్వర్ రెడ్డికి నిర్మల్ నియోజకవర్గంలో భారీ అనుచర గణం ఉంది. విద్యాసంస్థల అధినేతగా కొనసాగుతూనే ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ఆయన రాజకీయాల వైపు మళ్లారు. అనూహ్యంగా ప్రజారాజ్యం పార్టీలో చేరి 2009లో ఆయన నిర్మల్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ పార్టీ తరపున ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ పక్షనేతగా పనిచేశారు. ఆ తరువాత రెండుసార్లు కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఓడిపోయిన మహేశ్వర్ రెడ్డి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోనే భారీ విజయాన్ని నమోదు చేసుకున్నారు. బీజేపీ తరఫున గెలుపొందిన ఆయన ఆ పార్టీ శాసనసభ పక్షనేతగా అవకాశం పొందారు. ఆ హోదాలో ప్రభుత్వాన్ని అనేక అంశాల్లో ఆయన ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతూ అనేక సవాళ్లను ప్రభుత్వం ముందుంచుతున్నారు. ఒక వైపు నిర్మల్ నియోజకవర్గ ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూనే... మరోవైపు శాసన సభ పక్షనేతగా రాష్ట్ర రాజకీయాల్లోనూ కీలకంగా ఎదిగారు.

మంత్రి సీతక్కను కలిసిన
లక్ష్మణచాంద నాయకులు

లక్ష్మణచాంద, సెప్టెంబరు 21 : తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, దేవాదాయ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కను కాంగ్రెస్ పార్టీ లక్ష్మణ చందా మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ శనివారం కలి శారు. గతంలో పనులు పూర్తిచేసిన దేవాలయాలు, సీసీ రోడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున వాటి నిధులను వెంటనే విడు దల చేయాలని కోరారు. అలాగే నూతన అభివృద్ధి పనులు చేప ట్టాలని విన్నవించగా.. ఆమె సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.





మామిడిగూడ ఆశ్రమ హాస్టల్‌లో గిరిపోషణ్ మిత్ర

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబర్ 21 : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మామిడిగూడ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో 211 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ సర్ఫరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ జిల్లా వైద్యాధికారిని డాక్టర్ సాధన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న రక్తహీనతను గుర్తించి 10 గ్రాముల్లోపు పిల్లలకు ప్రత్యేక ఏర్పాట్లు నిర్వర్తిస్తూ వారి బాగోగులపై శ్రద్ధ తీసుకోవాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత పద్ధతుల గురించి వివరించారు.

బంద్.. సక్సెస్!





● ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన గేటు వద్ద ధర్నా చేస్తున్న ఆదివాసీ సంఘాల నేతలు

- జైనూర్ ఘటనను నిరసిస్తూ రాష్ట్ర బంద్‌కు పిలుపు
- నిందితుడిని శిక్షించాలంటూ డిమాండ్
- స్వచ్ఛందంగా మూసి వేసిన వ్యాపార సముదాయాలు
- డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు
- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు
- జిల్లా, మండల కేంద్రాలలో ఆదివాసీల ర్యాలీలు, రాస్తారోకోలు
- బందోబస్తును ఏర్పాటుచేసిన పోలీసులు

ఆదిలాబాద్, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): జైనూర్ ఆత్యాచార ఘటనను నిరసిస్తూ చేపట్టిన ఆదివాసీల రాష్ట్రబంద్ జిల్లాలో సక్సెస్ అయ్యింది. శనివారం ఉదయం నుంచే ఆదివాసీలు రోడ్ల పైకి వచ్చి బంద్‌ను నిర్వహించారు. ఏజెన్సీలో ఆదివాసీలకు అసలు రక్షణ లేకుండానే పోయిందని మండి పడ్డారు. ఆదివాసీ మహిళపై అత్యాచారం, హత్యాయత్నానికి పాల్పడిన ఎస్‌కే మగ్ధుమ్‌ను ఉరితీయాలంటూ డిమాండ్ చేశారు. అలాగే గాయపడిన ఆదివాసీ మహిళకు ప్రభుత్వమే చికిత్స అందించి ఆమె కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. అమాయక ఆదివాసీ మహిళలను జిహాది పేరుతో బలవంతపు పెళ్లిళ్లు, ఆత్యాచారం, హత్యలు చేస్తున్నవ్యక్తులపై కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం, గవర్నర్ పూర్తిగా విఫలం కావడంతోనే రాష్ట్రబంద్‌కు పిలుపునిచ్చామన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఆదివాసీమహిళలపై దాడులు చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివాసీల రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్న అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని మండిపడ్డారు. ఏజెన్సీలో బలవంతంగా నివాసం ఉంటున్న గిరిజనేతరులను వెంటనే ఇతర ప్రాంతాలకు తరలించాలని కోరారు. 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి గిరిజనులకు రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. ఆదివాసీల రాష్ట్ర బంద్ పిలుపుతో ఆదిలాబాద్ జిల్లాకేంద్రంతోపాటు ఆయా మండల కేంద్రాలాల్లో బంద్ చేపట్టారు. ముఖ్యంగా నార్నూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, తలమడుగు, బేల మండలాల్లో సంపూర్ణ బంద్ కనిపించింది. బంద్ సందర్భంగా ఆయా మండలాల తహసీల్దార్లకు ఆదివాసీలు వినతిపత్రాలను అందజేశారు. ఇందులో తుడందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షుడు గోడంనగేష్, వెట్టిమనోజ్, గోడంరేణుక, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, ఆదివాసీ విద్యార్థిసంఘం నాయకులు సలాంవరుణ్, సోయం లలితబాయి, ఆత్రం గణపతి, తొడసం ప్రకాష్, కోట్నాక్‌రామారావు, కుమ్రగోవింద్‌రావు తదితరులున్నారు. బంద్ కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టిబందోబస్తును ఏర్పాటుచేశారు. బస్టాండ్, కలెక్టర్‌చౌక్, శివాజిచౌక్, గాంధీచౌక్, పంజాబ్‌చౌక్ ప్రాంతాల్లో పోలీసులు నిఘా సారించారు. ఇచ్చోడలో పోలీసులు కవాతును నిర్వహించారు.

వ్యాపార సముదాయాలు బంద్

ఆదివాసీల రాష్ట్రబంద్ పిలుపుతో జిల్లాలో పలు వ్యాపార సముదాయాలు మూతబడ్డాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేసి బంద్‌కు సహకరించారు. మధ్యాహ్నం 1గంట నుంచి దుకాణాలు యధావిధిగా తెరుచుకున్నాయి. ఉదయం నుంచి దుకాణాలను బంద్ చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను కూడా మూసి వేశారు. జిల్లా కేంద్రంలోని శివాజిచౌక్, గాంధీచౌక్, అంబేద్కర్‌చౌక్, నేతాజిచౌక్, పంజాబిచౌక్, బస్టాండ్ పరిసరా ప్రాంతాల్లోని దుకాణాలు మూసి వేయడంతో రోడ్లన్ని జన సంచారం లేక నిర్మానుష్యంగా మారి కనిపించాయి. ఆదివాసీలు బైక్ ర్యాలీతో పట్టణంలోని పలు వీధుల గుండా తిరుగుతు దుకాణాలను మూసి వేయించారు. కొందరు బలవంతంగా దుకాణాలను తెరిచే ప్రయత్నం చేసినా ఆదివాసీల హెచ్చరికలతో మూసివేశారు.

ఆర్టీసీ డిపో ముందు ధర్నా

రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేసేందుకు ఆదివాసీలు ముమ్మర ప్రయత్నాలు చేశారు. ఉదయమే ఆర్టీసీ బస్టాండ్ వద్దకు చేరుకున్న ఆదివాసీలు ప్రధాన గేటు ముందు బైఠాయించి ధర్నాకు దిగారు. దీంతో బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. డిపో నుంచి బస్సులను బయటకు రానివ్వకుండా ఆదివాసీలు బైఠాయించడంతో బస్సు సర్వీసులు పూర్తిగా నిలిచిపోయాయి. మధ్యాహ్నం 12 వరకు బస్సులు డిపో నుంచి బయటకు రాలేదు. దీంతో పలు రూట్లలో వెళ్లే బస్సు సర్వీసులను అధికారులు రద్దుచేశారు. దీంతో ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడ్డారు. రాష్ట్రబంద్ విషయం తెలియని కొంతమంది ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చి బస్సుల కోసం గంటల తరబడి ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. మధ్యాహ్నం తర్వాత అన్నిరూట్లలో బస్సు సర్వీసులు యధావిధిగా కొనసాగాయి.

ర్యాలీలు, రాస్తారోకోలు

ఆదివాసీలకు రాష్ట్రప్రభుత్వం రక్షణ కల్పించాలంటూ నినాదాలు చేస్తూ ఆదివాసీలు జిల్లావ్యాప్తంగా ర్యాలీలు, రాస్తారోకోలు చేపట్టారు. దీంతోరాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ముందు గంటల తరబడి రాస్తారోకో చేయడంతో బస్సులు బయటకు రాలేదు. అలాగే ఇచ్చోడ, ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో ఆదివాసీలు బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. చట్టాలను ప్రభుత్వం అమలు చేయక పోవడం పై తీవ్రంగా తప్పుబట్టారు. ముఖ్యంగా ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి ఆదివాసీలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీని నిర్వహించిన ఆదివాసీలు రాష్ట్రప్రభుత్వ తీరును తప్పుబట్టారు. జైనూర్‌లో అక్రమంగా ఆదివాసీలపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. రక్షణ కల్పించాలని కోరితే బాధితుల పైననే కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమని మండిపడ్డారు.



ప్రయాణికులు లేక వెలవెలబోతున్న ఆర్టీసీ బస్టాండ్

సీఎం దృష్టికి గిరిజనుల డిమాండ్లు

● ఉట్నూర్‌లో మంత్రి సీతక్క



మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి సీతక్క

ఉట్నూర్, సెప్టెంబరు 21: శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోవాలని, హక్కుల సాధన కోసం, అభివృద్ధి సంక్షేమం కోసం జిల్లా గిరిజన ప్రతినిధులను ముఖ్య మంత్రితో బేటీ చేయిస్తానని సీతక్క ప్రకటించారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తామని, గిరిజనులు సంయమానం పాటించాలని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క అన్నారు. శనివారం రాత్రి ఉట్నూర్ మండల కేంద్రంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గోండ్వానా పంచాయతీ 126 రాయి సెంటర్ల పెద్దలతో మంత్రి సీతక్క ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌జిల్లా కలెక్టర్ రాజర్షిషా, వెంకటేశ్‌దోత్రే, మల్టిజోన్ 1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఎస్పీలు గౌస్‌ఆలం, డీవీ శ్రీనివాస్‌రావు, శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ కమిటీ సభ్యులతో కలిసి శనివారం సమావేశం నిర్వహించి వారి సమస్యలపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ రాయిసెంటర్ సభ్యులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని విద్య, వైద్యం, రహదారులు, ఉపాధి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఐక్యంగా, శాంతియుతంగా సమస్యలను పరిష్కరిస్తామని, అన్ని రం గాలలో అభివృద్ధి చేస్తామని తెలిపారు.

పిడుగు పాటుకు యువ రైతు మృతి

● బేల మండలం సిర్సన్నలో ఘటన

ఆదిలాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుకు ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ జిల్లా బేలలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... బేల మండలం సిర్సన్న గ్రామానికి చెందిన యువ రైతు రాథోడ్ అవినాశ్ (22) శనివారం పొలం పనులకు వెళ్లాడు. పొలం పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో అవినాశ్ ఇంటికి పరిగెత్తే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో పిడుగు పడడంతో ఆ యువకుడు పంట చేనులోనే అక్కడికక్కడే మృతి చెందాడు. తమ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటాడు. అనుకున్న చేతికి వచ్చిన కొడుకు అప్పుడే మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. మృతుడి తండ్రి రాథోడ్ భబన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన అవినాష్

● కాలిపోయిన టీవీలు, ఫ్రిజ్‌లు

బోథ్, సెప్టెంబరు 21 : బోథ్ మండల కేంద్రంలోని తొమ్మిదవ వార్డులో మేర రాజన్న అనే వ్యక్తికి చెందిన ఇంటిపైన శనివారం సాయంత్రం సన్‌డైరెక్ట్ కేబుల్ టీవీ కనెక్షన్‌పైన పిడుగు పడటంతో పిడుగు పడిన చోటగోడ ధ్వంసం అయింది. సాయంత్రం పూట ఆకస్మికంగా కురిసిన వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు రావడంతో 9వ వార్డులో ఉన్న పలువురి ఇండ్లలో ఉన్న టీవీలు, ఫ్రిజ్‌లు విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. దీంతో తీవ్ర నష్టం సంభవించింది. పిడుగు పడటంతో ప్రజలు భయ భ్రాంతులకు గురయ్యారు.

దివ్యాంగుల కోసం జాబ్‌క్యాలెండర్



హాస్టల్ గదులను ప్రారంభిస్తున్న మంత్రి

ఉట్నూర్, సెప్టెంబరు 21: త్వరలోనే దివ్యాంగుల కోసం ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ కూడా ప్రకటించనుందని రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎడ్ కళాశాలలో చాత్రో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించడానికి నోటిఫికేషన్ జారీ చేయడంతో అడ్డుకునే దానికి కొన్ని శక్తులు తయారు అయినప్పటికి ముఖ్యమంత్రి ఎవరికి భయపడకుండా డీఎస్సీ నిర్వహిస్తున్నారని, మరికొన్ని రోజుల్లోనే మరో డీఎస్సీ నిర్వహించడానికి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అప్పటి వరకు చాత్రో ఉపాధ్యాయులందరు పరీక్షలకు తయారు కావాలన్నారు. ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బైక్ అంబులెన్స్‌లకు జెండా ఊపి ప్రారంభించారు. మారుమూల గ్రామాలలో అనారోగ్యం ఏర్పడిన వారి సమాచారం కాల్ సెంటర్‌కు వస్తే అక్కడికి బైక్ అంబులెన్స్ ద్వారా వైద్య ఆరోగ్య సిబ్బంది చేరుకుని ప్రథమ చికిత్సలు అందించిన అనంతరం సమీపంలోని పీహెచ్‌సీ లేదా సీహెచ్‌సీకి తరలించి వైద్యం అందేలా కృషి చేస్తారన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రై సైకిళ్లను మంత్రి సీతక్క పంపిణీ చేసి ట్రై సైకిల్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోళ్ల పెంపకం ద్వారా మహిళలు ప్రత్యామ్నయ ఆదాయం పొందాలన్నారు. అదే విధంగా మహిళా సంఘాల కోసం ఏర్పాటు చేసిన ఇందిర మహిళ శక్తి క్యాంటిన్ ద్వారా మహిళలు చక్కటి ఆహార వస్తువులు అందుబాటులో ఉంచి అభివృద్ధి చెందాలని మంత్రి పేర్కొన్నారు.

కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబర్ 21 : రేణుక సిమెంట్ ఫ్యాక్టరీకి తమ భూములను ఇవ్వమని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట రూరల్ మండలంలోని యాపల్‌గూడకు చెందిన రైతులు శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రేణుక సిమెంట్ ఫ్యాక్టరీకి తమ పంట భూములను ఇవ్వదలుచుకోలేమన్నారు. ఒకవేళ ఎకరానికి రూ.40 లక్షలతో పాటు ఇంటికి ఉద్యోగం ఇస్తే అలోచిస్తామని పేర్కొన్నారు. రైతులను అధికారులు ఇబ్బందులు పెట్టొద్దని కోరారు. అనంతరం ఎంపీ గొడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి జోగు రామన్న, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డిని కలిసి రైతులు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

డిప్యుటేషన్ రద్దు చేయాలని నిరసన

భీంపూర్, సెప్టెంబరు 21 : మండలంలోని పిప్పల్‌కోటి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు సంధ్యరాణిని భీంపూర్ పాఠశాలకు డిప్యూటేషన్‌పై బదిలీ చేసినందుకు గ్రామస్తులు, విద్యార్థి తల్లిదండ్రులు శనివారం పాఠశాలకు తాళం వేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇటీవలే జిల్లా విద్యా అధికారి ప్రణీతను కలిసి విన్నవించామని గ్రామస్తులు తెలిపారు. విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పుతూ గ్రామంలో కుటుంబంలో ఒకరిగా మెలుగుతున్న ఆమెను డిప్యూటేషన్‌పై పంపితే తీవ్ర పరిణామాలు ఉంటాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు షేక్ అఫ్రోజ్, ఇంజాపూర్ రమాకాంత్, రెండ్ల జనార్ధన్, షేక్ లతీఫ్, సత్గారి అనిల్, కొలిపాక అశోక్ తదితరులు ఉన్నారు.

సాత్నాల చివరి ఆయకట్టుకు సాగునీరు

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్

జైనథ్, సెప్టెంబరు 21: మండలంలోని మధ్యతరహా ప్రాజెక్టు అయిన సాత్నాల ద్వారా చివరి ఆయకట్టు రైతులందరికీ సాగునీరు అందిస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. శనివారం మండలంలోని సాత్నాల ప్రాజెక్టు వద్ద రైతులు అధికారులు నాయకులతో కలిసి ఖరీఫ్,రబీ పంటలకు ప్రాజెక్టు కుడి ఎడమ కాల్వలకు సంబంధించిన కెనాల్‌ల ద్వారా సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తీవ్ర ఎండలకు పత్తి పంటలు ఎండుపోతున్న దృశ్యం ముందస్తుగా నీటిని విడుదల చేశామన్నారు. సాత్నాల ప్రాజెక్టు ఆధునీకరణ కోసం 19కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు విడుదల అయిన వెంటనే పనులు ప్రారంభించి ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ఫసల్‌బీమా పై రాష్ట్ర అసెంబ్లీలో చర్చించామని దీనికి సీఎం రేవం త్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకుందన్నారు.ఈ యేడాది నుంచి ఈ పథకం అమలు ద్వారా ఆదిలాబాద్ జిల్లా పత్తి రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సాత్నాల ప్రాజెక్టు ఈఈ విఠల్‌రాథోడ్, డీఈ శ్రీనివాస్,ఏఈ మారుతి, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు కట్కంరాందాస్, నాయకులు ఆదినాథ్, దయకర్, రమేష్, సుభాస్, సంతోష్, ముకుంద్‌రావు, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు

ఆదిలాబాద్‌అర్బన్ : జిల్లా కేంద్రంలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయలశంకర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో అమృత్ పథకం కింద మంజూరైన రూ.1.6 నిధులతో మంచినీటి ట్యాంక్ నిర్మాణం కోసం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆదిలాబాద్ మున్సిపాలిటి అన్నిరంగాల అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అమృత్‌పథకంకు సంబంధించిన నిధుల కోసం ఆదిలాబాద్ ఎంపీ ప్రయత్నిస్తూ ఉన్నారని తెలిపారు.

ఆ నిధులు వస్తే పట్టణం మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం ఎంపీ నగేష్ మాట్లాడుతూ నీటి సమస్య లేకుండా మురికి కాలువలు సిస్టం సరిగ్గా ఉండాలని ఉద్దేశంతో అమృత్ పథకంలో ఆదిలాబాద్ మున్సిపాలిటి ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంతో రూ.320 కోట్లతో పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు ప్రభుత్వమిచ్చిన సమయాన్ని కంటే ముందే నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను,కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ ఖమర్‌ఫైామద్, ఈఈ గంగాధర్, నాయకులు అశోక్‌రెడ్డి, సాయిరాము, స్వప్నసురేఖ, రాజునాందేవ్, మున్నా, స్వప్నిల్ తదితరులున్నారు.

తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబర్ 21 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వారిని ప్రోత్సహించాలని డీఈవో ప్రణీత అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మి వాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల తల్లిదండ్రుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలలో బోధించిన విషయాలను చదువుతున్నారా అని తల్లిదండ్రులు గమనించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

● కుటుంబసభ్యులు, తోటి విద్యార్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 21 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని నార్నూర్ మండలం చోర్‌గావ్ గ్రామ యువకుడు రాథోడ్ జితేందర్(20). ఇతను నార్నూర్‌లో బీఎస్సీ నర్సింగ్ మొదటిసంవత్సరం చదువుతున్నాడు. జితేందర్ ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ఎస్టీ వసతి గృహంలో ఉంటూ విద్యనభ్యసిస్తున్నాడు. అయితే శుక్రవారం అర్ధరాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు హాస్టల్‌కు వచ్చి.. పని ఉందంటూ జితేందర్‌ను బయటకు తీసుకెళ్లారు. ఆ తర్వాత విపరీతంగా కొట్టారు. అంతటితో ఆగకుండా విషం కూడా తాగించినట్లు విద్యార్థి జితేందర్ తన మామకు ఫోన్ చేసి విషయాన్ని తెలిపాడు. దీంతో వెంటనే కుటుంబీకులు పట్టణ శివారులో జితేందర్ స్పృహ కోల్పోయి పడి ఉన్న స్థలానికి వచ్చి చూశారు. చికిత్స నిమిత్తం వెంటనే రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. శనివారం ఉదయం మెరుగైన వైద్యం కోసం బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో పొందుతూ సాయంత్రం జితేందర్ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, కుటుంబీకులకు ఆస్పత్రి ఎదుట జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. విద్యార్థి మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ఆందోళనకారులను చెదరగొట్టడంతో గొడవ సద్దుమణిగింది. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు మావల ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు.

● ఊరిలో జరిగిన గొడవ హత్యకు దారి తీసిందా..?

నార్నూర్ మండలంలోని చోర్‌గావ్‌లో ఇటీవలే తీజ్ పండుగ వేడుకల్లో గ్రామానికి చెందిన ఓ యువకుడితో జితేందర్‌కు మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. దీన్ని మనసులో పెట్టుకొని ఆ యువకుడు కొంత మంది యువకులతో కలిసి జితేందర్‌ను హత్య చేసేందుకు వసతి గృహానికి వచ్చి బయటకు పిలిచి దాడి చేసినట్లు తెలిసింది. ఈ దిశగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 21 : దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శనివారం మండలంలోని ఈశ్వర్‌నగర్ గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గ్రామస్తుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం టీటీడీ రూ.10 లక్షల నిధులతో వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలపై వేంకటేశ్వర స్వామి దీవెనలు ఎల్లప్పుడు ఉండాలని కోరు కున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తుందని పేర్కొన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, గ్రామమాజీ సర్పంచ్ రాథోడ్ శారదా సునీల్, పట్టణ అధ్యక్షులు ఎం.డి.జహర్, నాయకులు ఎం.డి.మసూద్, సోమోరే నాగోరావు పాల్గొన్నారు.